కథ

# లైట్ హౌస్

**'ఫొటోలో కంటే అందంగా ఉంది' అనుకున్నాడు శ్రీకాంత్ ఎదురుగా కూర్చున్న శ్వేతను చూసి ముగ్ధుడై.**

**'అమ్మాయి లక్షణంగా ఉంది. కొడుక్కి తగరంటూ ఎందరో అమ్మాయిలను కాదన్న వర్ధనం ఈ పిల్లను తప్పకుండా కోడలుగా చేసుకుంటుంది' అనుకున్నారు తండ్రి రామారావుగారు.**

'అమ్మాయి కుందనపు బొమ్మ. అబ్బాయికి తగిన జోడీ'- అనుకొని లోలోపల మురిసిపోయింది వర్ధనమ్మ. ఇద్దరూ కొడుకు వైపు చూశారు. అతని మొహం ప్రసన్నంగా ఉండటం చూసి తృప్తిపడ్డారు.

విడిగా మాట్లాడుకోవటానికి శ్వేత, శ్రీకాంత్ స్టడీరూములోకి వెళ్లారు. రూము చాలా నీట్‌గా ఉంది. పుస్తకాలు రేకలలో అందంగా అమర్చబడి ఉన్నాయి. గోడమీద పూలమాలతో సరస్వతీదేవి పటం.

''చాలా మంచి కలక్షను ఉందే! మీరు లిటరేచరులో డిగ్రీ చేశారు కదూ! అందుకే మీరు పుస్తకాలు ఎక్కువగా చదువుతారనుకుంటాను'' అన్నాడు శ్రీకాంత్ అన్నిటిని చూసి వచ్చి కుర్చీలో కూర్చుంటూ.

''చదివింది లిటరేచరే కాని నాకు పుస్తకాలు చదవాలనే ఆసక్తి, చదివే ఓపిక లేవు. నేను మ్యాగజైన్సు తప్ప మరేవీ చదవను. మా చెల్లి శ్యామల మాత్రం గంటల తరబడి వీటిని చదువుతూ కాలక్షేపం చేస్తుంది'' అంది శ్వేత.

''ఆవిడ చదువు పూర్తయిందా?''

''అయింది. తను సైన్సు గ్రూపుతో డిగ్రీ చేసి బి.ఎడ్ కూడా చేసి టీచరుగా జాబ్ చేస్తోంది''

''మీకు, మీ చెల్లెలికి అభిరుచుల్లో చాలా తేడాలున్నాయే!''

''అభిరుచుల్లోనే కాదు. రూపురేఖల్లో కూడా తేడాలున్నాయి'' అంది శ్వేత నవ్వుతూ.

''అవునా?''

''అవును. మా ఫ్రెండ్సంతా మా శ్యామలకు దిష్టిచుక్క అని పేరు పెట్టేరు'' అంది.

''పాపం ఆవిడ బాధపడేవారేమో! మీరు ఓదార్చేవారా?''

''అలాంటి అవసరం ఎప్పుడూ రాలేదు. ఎందుకంటే మా శ్యామలది చాలా గట్టి గుండెలెండి. తను ఏమని జవాబిచ్చేదో తెలుసా?''

శ్రీకాంత్ కుతూహలంగా చూశాడు.

''పురిటిస్నానం అయినప్పటి నుంచి మనిషి జీవితంలో వచ్చే ప్రతి ఫంక్షనుకు ముస్తాబు దిష్టి చుక్కతోకాని పూర్తవదు కదా! అంత ముఖ్యమైన దిష్టిచుక్కతో నన్ను పోల్చినందుకు మెనీ థ్యాంక్సు- అని నవ్వుతూ జవాబు చెప్పేది'' అంది శ్వేత.

'నలుపని వెక్కిరించినా చిన్నబుచ్చుకోకుండా చక్కని వివరణతో త్రిప్పికొట్టిన శ్యామల ఆత్మవిశ్వాసం గల అమ్మాయన్నమాట' అనుకున్నాడు మెచ్చుకోలుగా. అంతలోనే అతని దృష్టి గది మధ్యగా ఉన్న అందమైన రంగుల ముగ్గుమీద పడింది.

''ముగ్గు చాలా బాగుంది. మీరే వేసేరా?'' అని అడిగాడు.

''నాకూ, ముగ్గులకు చాలా దూరం. మా శ్యామలకు ముగ్గులంటే పిచ్చి. తనే వేసేది. ధనుర్మాసం వచ్చిందంటే చాలు, పన్నీరు జల్లుతున్నంత ఆనందంగా కళ్లాపి జల్లేసి పెద్ద ముగ్గులు వేసేస్తూ ఉంటుంది. ముగ్గులు ఒక కళ అని ఆ కళతో భూదేవిని సేవించాలని అంటూ ఉంటుంది. ఆరిందాలాగా'' శ్వేత గొంతులో వెక్కిరింత.

చల్లనిగాలి పూల పరిమళాలను మోసుకొచ్చింది.

''మీ కాంపౌండులో చాలా రకాల పూల మొక్కలున్నాయి. గార్డెనింగంటే మీకిష్టమా?'' కిటికీలోంచి బయటకు చూస్తూ అడిగాడు శ్రీకాంత్.

''నాకు కాలికి మట్టి అంటితేనే చిరాకుగా ఉంటుంది. నేనెప్పుడూ మొక్కల జోలికి పోను. మొక్కల సంరక్షణని మా నాన్నగారు, శ్యామల చేస్తూ ఉంటారు''

''డిగ్రీ పూర్తయినప్పటినించి మీరు ఖాళీగా ఉన్నారు కదా! ఇంటి పనిలో, వంట పనిలో మీ అమ్మగారికి సహాయం చేస్తూ ఉంటారా?'' శ్రీకాంత్ అడిగిన ప్రశ్న శ్వేతకు చిరాకు కలిగించింది. పెళ్లిచూపుల్లో ప్రతి మగవాడు తప్పనిసరిగా ఈ ప్రశ్న అడుగుతాడు కాబోలు! ఇదివరకు వచ్చిన పెళ్లి కొడుకులు కూడా తనను ఇదే అడిగేరు. తనకు ఒళ్లుమండిపోయింది. ''ఇంటి పని, వంట పని చెయ్యటానికేనా పెళ్లాం!'' అని అడిగి తిరస్కరించింది. శ్రీకాంత్ రూపం ఆమెను బాగా ఆకర్షించడంతో కోపం తెచ్చుకోలేకపోయింది.

''పనితో నలగడం నాకిష్టం ఉండదు. మా అమ్మ కూడా నన్ను ఏ పనీ ముట్టుకోనివ్వదు. చిన్నప్పటినించి మా శ్యామలకే పనులు చెప్పేది. ఇప్పుడైతే చెప్పనవసరం లేకుండానే మా శ్యామల వంట కూడా చేసేస్తూ ఉంటుంది. అంట్లు తోమటం, బట్టలుతకటం లాంటి బండపనులు కూడా ఇష్టంగా చేస్తుంది. పనిమనిషి రాని రోజు దానికి పండగే. చేతినిండా పనుందంటూ సంబరపడిపోతుంది. వంటపనికి, ఇంటిపనికి అంకితమైపోవడం నాకు బొత్తిగా నచ్చదు.''

''అంటే మీరు చాలా అపురూపంగా పెరిగారన్నమాట'' అన్నాడు శ్రీకాంత్.

''అవును'' అంది శ్వేత. ఆమె అందమైన కళ్లలో గర్వరేఖ తళుక్కుమంది.

''ఇంతవరకూ మీకు నచ్చని వాటి గురించి చెప్పేరు. మరి మీకు నచ్చేవి ఏమిటి?''

''టి.వి., సినిమాలు, షాపింగు, పిక్నిక్‌లు''

''మీ చెల్లెలు మీతో షాపింగుకు వస్తూ ఉంటారా?''

''మా శ్యామలకు నాలాగా ఎక్కువ టైము షాపింగులో గడపటం ఇష్టం ఉండదు. అందుకని వేరుగా వెళ్లి కావలసినవి కొనుక్కుంటుంది. గంటల కొద్దీ షాపింగు చేస్తే తప్ప నాకు తృప్తిగా ఉండదు'' శ్వేతను ఏదడిగినా జవాబులో శ్యామల ప్రసక్తి తప్పనిసరిగా వస్తూ ఉండటంతో శ్రీకాంత్‌కు ఆమె పట్ల కుతూహలం కలిగింది.

అప్పుడే శ్యామల రెండు గ్లాసులతో జ్యూస్ తెచ్చి ఇద్దరికీ అందించింది. శ్వేత, శ్యామలను శ్రీకాంత్‌కు పరిచయం చేసింది.

''నమస్తే'' అంది శ్యామల చేతులు జోడించి.

విశాలమైన ఆమె కాటుక కళ్లలో ఆత్మవిశ్వాసం, అధరాల మీద అలసిన మనిషిని సేదదీర్చేటట్లున్న చల్లని చిరునవ్వు.

''మీరు టీచరుగా జాబ్ చేస్తున్నారుట కదా! ఏ సబ్జెక్ట్సు చెప్తారు?'' అని అడిగాడు శ్రీకాంత్.

''లెక్కలు, సైన్సు'' అని జవాబు చెప్పి వస్తానంటూ వెళ్లిపోయింది శ్యామల.

''జ్యూస్ ఫ్రెష్‌గా చాలా బాగుంది. ఇంట్లో చేసేరా?''



''అవును. లేడీస్ క్లబ్బు వాళ్ళు కండక్ట్ చేసిన క్లాసులకు వెళ్లి మా శ్యామల జ్యూస్, జామ్, కేకులు లాంటివన్నీ చేయటం నేర్చుకుంది. నన్నూ రమ్మంది కాని ఇష్టం లేక వెళ్లలేదు'' అంది శ్వేత.

''ఎందుకని ఇష్టంలేదు?''

''అన్నీ రెడీమేడ్‌గా బజారులో దొరుకుతున్నప్పుడు ఇంట్లో కష్టపడటమెందుకని నేననుకుంటాను. స్వంతంగా చేసుకుంటే తృప్తిగా ఉంటుందని తను అనుకుంటుంది'' అంది.

తరువాత శ్వేత ఢిల్లీలో శ్రీకాంత్ చేస్తున్న ఉద్యోగం గురించి, సోషల్ లైఫ, చుట్టుప్రక్కల చూడదగిన ప్రదేశాల గురించి అడిగి తెలుసుకుంది.

ఆమె తన ఇష్టాయిష్టాల గురించి ఏమీ అడగకపోవడం అతనికి నిరుత్సాహాన్ని కలిగించింది.

''లైఫ్ పార్ట్‌నర్ ఎలా ఉండాలని కోరుకుంటారు?'' అని అడిగాడు.

''నాకు అనుగుణంగా నడుచుకోవాలని'' తడుముకోకుండా చెప్పింది.

''తేడాలుంటే సర్దుకోగలరా?''

''సర్దుకోలేను. ఎందుకంటే సర్దుకోవటమంటే వ్యక్తిత్వాన్ని చంపుకోవడమేనని నా అభిప్రాయం'' నసుగుడు లేకుండా నిస్సంకోచంగా తన అభిప్రాయాన్ని ఆమె వెల్లడించిన తీరు అతన్ని నివ్వెరపరిచింది.

''వెళ్లొస్తాను'' చిరునవ్వుతో చెప్పేసి లేచాడు.

★ ★ ★

శ్వేత రూపం కాకుండా శ్యామల కాటుక కళ్లు, చిరునవ్వు పదే పదే గుర్తుకు వస్తూ ఉండటంతో తన మనసు శ్యామలవైపు మొగ్గుతూందని అర్ధమైంది శ్రీకాంత్‌కు. చూడగానే శ్వేత అందం తనను ఆకర్షించింది. కానీ జంకుగొంకు లేకుండా ఫ్రీగా ఆమె మాట్లాడిన తీరులో అహంభావం, పని పట్ల అనాసక్తత, చెల్లెలి పట్ల ఒకింత చులకన భావం వ్యక్తమవటంతో తన మనసు ఆమెకు అనుకూలంగా స్పందించలేకపోయింది. చిత్రంగా ఆమె మాటల్లోనే శ్యామల వ్యక్తిత్వం పట్ల తనకొక అవగాహన ఏర్పడింది. చాయ తక్కువని చిన్నచూపు చూసినా ఆత్మన్యూనతా భావంతో కృంగిపోకుండా నిలబడింది. అక్కలాగా అందగత్తె కాదనే చులకన భావంతో పనులు చెప్తున్నారని అర్థమైనా, పట్టించుకోకుండా ప్రతి పనిని ఎంతో శ్రద్ధతో చేస్తూ తనను తాను సమర్ధురాలుగా తీర్చిదిద్దుకుంది. కాలం విలువ, పని విలువ తెలుసుకొని క్షణం కూడా వృధా చెయ్యకుండా బాధ్యతతో నడుచుకొనే అమ్మాయి! అలాంటి అమ్మాయినే తను భార్యగా కోరుకుంటున్నాడు. శ్యామలతో మాట్లాడి ఆమెకు కూడా తను నచ్చితే ఆమెని పెళ్లి చేసుకో

జి.సరస్వతి

వాలి! శ్రీకాంత్ తన మనసులోని మాట చెప్పగానే రామారావుగారు, వర్ధనమ్మ విస్తుపోయారు. వర్ధనమ్మకు కొడుకు మీద కోపం వచ్చింది.

''అక్క నచ్చకపోవడం, అంతకంటే అందంగా ఉన్న చెల్లెల్ని ఇష్టపడటం లోకంలో జరుగుతూ ఉంటుంది. నువ్వేమిట్రా రివర్సులో వెళ్తున్నావు?'' అని అడిగింది చికాకుపడిపోతూ.

''గారాబంగా పెరగటం వల్ల శ్వేతలో అహంభావం ఎక్కువ. తన ఇష్ట ప్రకారం భర్త నడుచుకోవాలని కోరుకునే అమ్మాయి. భార్యాభర్తలు ఒకరినొకరు డామినేట్ చెయ్యాలనుకుంటే కలతలు తప్పవమ్మా! అందుకే శ్వేతను నేను ఇష్టపడలేకపోయాను. శ్వేత మాటల్లోనే విన్నా శ్యామల మనస్తత్వం, అభిప్రాయాలు, అభిరుచులు నాకు బాగా నచ్చాయమ్మా! తేడాలున్నా సర్దుకుని సంతోషంగా బ్రతకగలమని అనుకుంటున్నాను'' అన్నాడు శ్రీకాంత్.''నువ్వు మా మాట ఎప్పుడు విన్నావులే! మెడిసిన్ చదవమంటే ఇంజనీరింగు చదివేవు. అమెరికా వెళ్లమంటే ఇండియాలో ఉండటమే ఇష్టమన్నావు. మాట వినకపోయినా ప్రయోజకుడివయావని సంతోషించేము. పెళ్లి విషయంలోనైనా మా మాట వింటావని చుక్కలాంటి చక్కని అమ్మాయిని చూపిస్తే కాదంటున్నావు'' అంది వర్ధనమ్మ నిష్ఠూరంగా.

''మీ మాట ప్రకారం నడుచుకోలేకపోయినా నేను నడిచిన దారి మంచిదేనని ఒప్పుకున్నావు కదమ్మా! అలాగే మీరు చూపెట్టిన అమ్మాయిని కాకపోయినా ఆ కుటుంబంలోని పిల్లనే చేసుకొని సుఖంగా ఉంటే సంతోషించవా అమ్మా!'' అని శ్రీకాంత్ అడిగేసరికి ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది.

★ ★ ★

శ్రీకాంత్ శ్వేతను కాదన్నందుకు ఎంత బాధపడ్డాడో, శ్యామలను ఇష్టపడినందుకు అంత ఆనందించాడు శేఖరం. నెమ్మదస్తురాలైన శ్యామలంటే అతనికి వల్లమాలిన ప్రేమ. బుద్ధిమంతురాలు, పనిమంతురాలు అయినా రంగు తక్కువ కావటం వల్ల శ్యామలకు పెళ్లికావటం కష్టమవుతుందని లోలోపల దిగులు పడుతూ ఉండేవాడు శేఖరం. శ్రీకాంత్ తనంతట తానే శ్యామలను చేసుకుంటానని చెప్పేసరికి అతనికి గొప్ప రిలీఫ్ కలిగింది. శ్రీకాంత్ చెల్లెల్ని ఇష్టపడ్డాడని తెలిస్తే శ్వేత చిన్నబుచ్చుకుంటుందని, అందుకని శ్వేతకు పెళ్లయ్యేవరకు తను ఈ విషయాన్ని ఇంట్లో వాళ్లతో చెప్పలేనని శేఖరం- రామారావుగారితో అన్నాడు. అతని ఇబ్బందిని అర్థం చేసుకున్న రామారావుగారు సరేనన్నారు. కొద్దిరోజులకే శ్వేతకు చక్కని కలిగినింటి సంబంధం కుదిరి పెళ్లయిపోయింది. ఆమె భర్తతో ఆనందంగా హనీమూన్‌కు వెళ్లిపోయింది.


★ ★ ★

ఒకరోజు శేఖరం భార్య కమలను, శ్యామలను కూర్చోబెట్టి శ్రీకాంత్ విషయం చెప్పాడు. కన్నతల్లిగా కమల మనసారా ఆనందించింది. 'నా తల్లి అదృష్టవంతురాలు' అంది శ్యామలను వాత్సల్యంతో దగ్గరకు తీసుకొని తల నిమురుతూ.

శ్రీకాంత్ తనను నచ్చుకున్న సంగతి తెలుసుకున్న శ్యామల తన చెవులను తానే నమ్మలేకపోయింది. ఊహ తెలిసినప్పటినించి తండ్రి తప్ప ఇంటా బయటా అందరూ అక్కతో తనను పోల్చి కించపరచడమే తెలుసు. బాధపడుతూ కూర్చుంటే ఏమీ సాధించలేదని తెలుసుకున్న తను చదువుతోబాటు ఇంటి పనులను కూడా శ్రద్ధగా చేస్తూ ఎప్పుడూ బిజీగా ఉండటం అలవాటు చేసుకుంది. పుస్తకపఠనం, గార్డెనింగు తనకు ఉల్లాసాన్ని చేకూరుస్తూ ఉండటంతో బాధపడటం మానేసింది. చదువు, ఉద్యోగం, ఇంటిని అందంగా తీర్చిదిద్దుతూ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగల సమర్థత ఉన్నా మొదటి చూపులోనే ఆకర్షించగల శరీరచ్ఛాయ లేకపోవడం వలన పెళ్లికొడుకులు తనతో మాట్లాడటం కాని తన గురించి తెలుసుకునే ప్రయత్నంగాని చెయ్యరని భావించి పెళ్లిమీద పెద్దగా ఆశలు కూడా పెట్టుకోలేదు తను! మరి శ్రీకాంత్ తనలో ఏం చూసి నచ్చుకున్నాడబ్బా? అనుకుంది శ్యామల.

ఆ మాటే అడిగింది శ్రీకాంత్‌ను కలిసినప్పుడు-

''మీ కాటుక కళ్లు, చిరునవ్వు నా కళ్లకు నచ్చాయి. మీ అభిరుచులు, అభిప్రాయాలు, హాబీలు, టోటల్‌గా మీ వ్యక్తిత్వం నా మనసుకు నచ్చాయి. తేడాలున్నా సర్దుకొని సంతోషంగా బ్రతకగలమనే నమ్మకం నాకు కలిగింది. ఏమంటారు?'' సూటిగా, క్లుప్తంగా తన మనసు విప్పి చెప్పాడు శ్రీకాంత్.




''మీది రైట్ ఛాయిస్ అని సంతోషపడే లాగా నడుచుకుంటాను'' అంది శ్యామల అందంగా నవ్వుతూ. శ్వేత హనీమూన్‌నించి తిరిగి వచ్చేసరికి ఇల్లు శ్యామల పెళ్లి పనులతో హడావిడిగా ఉంది. విషయమంతా విన్న శ్వేత, ''నాకు తెలియకుండానే నేను శ్యామలకు మౌత్‌పీస్‌ని అయ్యానన్నమాట'' అంది నవ్వుతూ. మొదటిసారిగా చెల్లెల్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని 'కంగ్రాచ్యులేషన్స్' చెప్పింది మనస్ఫూర్తిగా.

★ ★ ★

''నువ్వు చెప్పిందంతా కథలాగ చిత్రంగా ఉందే వర్ధనం! ఘటన అంటే ఇదే కాబోలు'' అంది రమణమ్మ వర్ధనమ్మతో.

రమణమ్మ వర్ధనమ్మకు పెత్తల్లి కూతురు. వయసులో వర్ధనమ్మ కంటే కొంచెం పెద్దది. ఇద్దరి మధ్య స్నేహం ఉంది. కలిసినప్పుడు మనసులు విప్పి మాట్లాడుకొనే అలవాటు ఉంది. కొడుకు పెళ్లికి పిలవటానికి భర్తతో వచ్చిన వర్ధనమ్మ తన మనసులో రగులుతున్న అసంతృప్తి గురించి చెప్పుకొని బాధపడింది.

''ఘటనే కావచ్చు కాని నాకు మాత్రం చాలా వెల్తిగా ఉందే అక్కయ్యా! అబ్బాయి శ్యామలను నచ్చుకోవటం నాకు బొత్తిగా ఇష్టమనిపించటం లేదే!'' అంది వర్ధనమ్మ.

''శ్వేతతో శ్యామలను పోల్చి చూడటం వల్ల నీకు అసంతృప్తి కలుగుతూంది కాని శ్యామలకేం తక్కువే వర్ధనం? చదువు, అణకువతోబాటు అబ్బాయి కోరుకున్న అన్ని మంచి లక్షణాలు ఉన్న లక్షణమైన పిల్ల. శ్వేత అందం అబ్బాయి కంటిని మాత్రమే ఆకర్షించింది కాని శ్యామల వ్యక్తిత్వం అబ్బాయి మనసును ఆకట్టుకుందే. అన్యోన్య దాంపత్యానికి అందచందాల కంటే మనసులు కలవటం ముఖ్యమనే విషయం నీకు మాత్రం తెలియదా? పెళ్ళి టైము దగ్గరకొచ్చినా నువ్విలాగ బాధపడటం సబబుగా లేదే వర్ధనం! నువ్వు ముభావంగా ఉంటే అబ్బాయి మనసు కష్టపడుతుంది. వాడిని చిన్నబుచ్చకు. తగిన జోడీని ఎంచుకున్నాడని తెలుసుకొని శ్యామలను మనస్ఫూర్తిగా కోడలుగా చేసుకొని ప్రేమగా చూసుకో'' అంటూ రమణమ్మ హితవు పలికింది.

''నీ మాటలు విన్నాక నా మనసుకు పట్టిన మబ్బు విడిపోయిందే అక్కయ్యా! నాకెంతో తేలిగ్గా ఉంది'' అంది వర్ధనమ్మ నిండుగా నవ్వుతూ.

శుభలేఖ ఇచ్చి రమణమ్మను, ఆమె భర్తను పెళ్లికి తప్పకుండా రమ్మని ఆహ్వానించి ఆనందంగా భర్తతోబాటు బయటకు నడిచింది వర్ధనమ్మ. ✤